క్లుప్తంగా

తూతూ మంత్రంగా రామడుగు మండల సభ

రామడుగు: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ కలిగేటి కవితలక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు హాజరుకాకపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని పలువురు ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. గోపాల్‌రావుపేటలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీటీసీ ఎడవెల్లి నరేందర్‌రెడ్డి కోరారు. మండలాధికారులు పలుశాఖలకు సంబంధించిన అంశాలను సభ్యులకు వివరించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వరీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అమ్మకాలు కొనసాగిస్తే చర్యలు

జమ్మికుంట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిసేధించిన ప్లాస్టిక్ కవర్లు పట్టణంలో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఆయాజ్ గురువారం ప్రకటనలో హెచ్చరించారు. పట్టణానికి చెందిన చిరు వ్యాపారులు, హోల్‌సెల్ షాపులు, ఫంక్షన్ హాళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడితే రూ.ఐదువేల నుంచి రూ.50వేల వరకు జరిమానా విధిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ పర్యావరణ కాలుష్య కారకమని, అనారోగ్యాలకు గురవుతమని, గన్నీ సంచులను వాడాలని సూచించారు.

పంచాయతీ సిబ్బంది సమయపాలన పాటించాలి

సైదాపూర్: గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీడీవో యాదగిరి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగు నీటి, చెత్త సమస్యలు రాకుండా చూడాలని, హరితహారం మొక్కలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి కూలీలకు వంద రోజుల పని కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పీల్డు అసిస్టెంట్లు ఉన్నారు.

రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే

హుజూరాబాద్: దేశంలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేశ్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులను ఆదుకునేందుకు ఒకే దఫాలో రుణమాఫీ ప్రకటించడం కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలచే కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేయాలన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల మాదిరిగానే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రకటించిన ప్రతి గ్యారెంటీని అమలు చేస్తుందన్నారు. సమావేశంలో నాయకులు నరేశ్, బాబు, రవీందర్‌గౌడ్, అనిల్, తిరుపతి, ముక్క రమేశ్, రవితేజ పాల్గొన్నారు.


ఖరీఫ్ నుంచే వరికి బోనస్ చెల్లించాలి

హుజూరాబాద్‌రూరల్: ఖరీఫ్ సీజన్ నుంచే వరిపంటకు రూ.500 బోనస్ ప్రకటించాలని రైతు అభివృద్ధి సమితి నాయకులు కోరారు. గురువారం మండలంలోని రాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రైతులకు ప్రకటించిన బోనస్ ఈ ఖరీఫ్ సీజన్ నుంచే వర్తింపజేయాలన్నారు. ఏ గ్రేడ్‌కు రూ.2,203, బీ గ్రేడ్‌కు రూ.2183 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైస్‌మిల్లర్లు తరుగు తీయకుండా కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి సాదులా అంశిరెడ్డి, చల్లూరి సారయ్య, జక్కోజు ఆంజనేయులు, చల్లూరి ఆగయ్య, రూపిరెడ్డి మల్లారెడ్డి, గంగుల శ్రీనివాస్,రాజు,ఎర్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

హుజూరాబాద్: పంటలు ఎండిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధి దమ్మక్కపేటలో వరి పొలాలను పరిశీలించారు. ఎకరాకు రూ.15 వేల చొప్పున చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. వెంట నాయకులు కొండల్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీ పరామర్శ



కిష్టారెడ్డిని పరామర్శించిన వినోద్‌కుమార్

రామడుగు: మండలంలోని వెంకట్రావుపల్లికి చెందిన మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి తల్లి వీరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్ కిష్టారెడ్డిని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్ రావు, మానకొండూర్ జడ్పీటీసీ శేఖర్‌గౌడ్, రాజేందర్‌రావు, నాగరాజుయాదవ్, సాయికృష్ణ, పలువురు పాల్గొన్నారు.

నెర్రెలు బారిన గోడలు, కుంగిన ఫ్లోరింగ్

సైదాపూర్: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి, ఉపాధి హామీ కార్యాలయాం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. భవనం నిర్మించిన ఎనిమిదేండ్లు అవుతుంది. భవనాన్ని ప్రారంభించిన ఏడాదికే కింది ఫ్లోరింగ్ కుంగింది. అప్పటి నుంచి పాలకులు, ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, కనీస వసతులు కల్పించలేదని, భవనం గోడలు నెర్రెలు బారాయని వాపోతున్నారు. మెట్ల కింద వేసిన ఫిల్లర్లు కుంగడంతో మెట్లకు భవనం గోడలకు మధ్య అర ఫీటు నెర్రెలు ఏర్పడ్డాయి. ప్రతి రోజు మహిళలకు సమావేశాలు, సిబ్బందికి కార్యక్రమాలుంటాయి. భవనం ఎప్పుడు కూలుతుందోననివారు భయాందోళన చెందుతున్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సారించి మరమ్మతులు పనులు చేయించాలని మహిళా సంఘాల సభ్యులు, సిబ్బంది కోరుతున్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలతో డ్రైనేజీ

మానకొండూర్‌రూరల్: మండల కేద్రంలోని పోస్టాఫీస్ కార్యాలయం, ప్రభుత్వ బాలుర హైస్కూల్ సమీపంలోని డ్రైనేజీ ప్లాస్టిక్, వ్యర్థపదార్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తకుండీలను ఏర్పాటు చేయక పోవడం, రోజూ చెత్తను తీసుకవెళ్లే ట్రాలీఆటో రాకపోవడంతో కాలనీవాసులు చెత్తను రోడ్డుపై వేస్తున్నారు. మరోవైపు పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. రోగాలబారినపడకముందే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





పొంచి ఉన్న ప్రమాదం

మానకొండూర్: మండల కేంద్రంలోని చెరువుకట్ట వద్ద కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతతో ప్రమాదం పొంచి ఉంది. రెండు నెలలైనా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు, వాహనదారులు మండిపడుతున్నారు. మూలమలుపులో ఏర్పడిన గుంత కనిపించడం లేదని, ప్రమాదం జరగకముందే గుంతను పూడ్చాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యలో మురుగునీరు



శంకరపట్నం: మండలంలోని మొలంగూర్‌లో ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వడంతో ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు. ఇళ్లకు సమీపంలోని ఓ పారాబాయిల్డ్ రైస్‌మిల్ నుంచి వచ్చే వ్యర్థజలం ఇళ్ల చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలోకి చేరుతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, రోగాల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని ఇళ్ల యజమానులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణం నీరు నిల్వ లేకుండా చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



శంకరపట్నం: మండలంలోని మక్త గ్రామ శివారులో డబుల్‌రోడ్డు పనులు జరుగుతున్నాయి. రోడ్డు పక్కనే రోడ్డుకు సమాన ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడో ఏ ప్రమాదం జరుగుతుందోనని, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కన్నుల పండువగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



ఇల్లందకుంట: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు





రామడుగు: వెలిచాలలో నారసింహ హోమం, దేవతమూర్తులను తీసుకువస్తున్న నిర్వాహకులు

ఇల్లందకుంట: మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామంలోని గుట్టపై స్వయంభూ నల్లొండ శ్రీలక్ష్మీ నర్సింహస్వామి కల్యాణం గురువారం ఆలయ కమిటీ చైర్మన్ తిట్ల చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ప్రదీప్‌శర్మ వేదమంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణం తిలకించారు. అనంతరం అర్చకులు భక్తులకు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

రామడుగు: మండలంలోని వెలిచాల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం శ్రీసుదర్శన నారసింహ హోమం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిత్య హోమం, విశేషాంగ సుదర్శన హోమం, బలిహరణం, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వీర్ల ప్రభాకర్‌రావు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ వీర్ల సరోజన, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి



శంకరపట్నం: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కవిత



గంగాధర: అవగాహన కల్పిస్తున్న సౌందర్య

శంకరపట్నం: మండలంలోని చింతలపల్లి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత మాట్లాడారు. పిల్లలకు అందించే ఆహారం గూర్చి వివరించారు. తల్లులు, పిల్లలు పోషకాహారం తీసుకోవాలని, చిరుధాన్యాలు తీసుకోవడంలోని లాభాలను వివరించారు. ఈకార్యక్రమంలో టీచర్లు సరిత, ఆశ, మమత పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని కాసారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఏసీడీపీవో సౌందర్య మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు మంచి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాల ప్రాముఖ్యత తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, పంచాయతీ కార్యదర్శి బాబి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను సన్మానించిన నాయకులు



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చొప్పదండి: మండల కేంద్రంలో చొప్పదండి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. మండలంలోని రుక్మాపూర్ మాజీ ఎంపీటీసీ రంగన్న ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్తున్న క్రమంలో చొప్పదండిలో కొద్ది సేపు ఆగి కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, బొడిగె శ్రీనివాస్‌గౌడ్, కల్లెపల్లి కనుకయ్య, గుర్రం హన్మంత రెడ్డి, కదారి శంకర్, కళ్యాణపు శ్రీనివాస్, చిల్ల శంకర్, బొడిగె తిరుపతిగౌడ్, దూస కైలాసం, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనపై అవగాహన ర్యాలీ

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి బోర్నపల్లిలో గురువారం కుష్ఠు వ్యాధి నిర్మూలనపై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 11 నుంచి 24వ తేదీ వరకు వ్యాధి గుర్తింపు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వ్యాధి గ్రస్తులను గుర్తించేందుకు ఇంటింటికి ఏఎన్‌ఎంలు సర్వే చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రమేశ్, వనీత, ఆశ వర్కర్లు అరుణ, రమాదేవి తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరణ

పెద్దపేగు క్యాన్సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కూరపాటి రాధికారమేశ్ అన్నారు. గురువారం పెద్దపేగు క్యాన్సర్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కూరపాటి హాస్పిటల్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుత జీవన విధానంతో పెద్దపేగు క్యాన్సర్ వ్యాప్తిస్తుందని, వ్యాధి ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



క్యాన్సర్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

• మద్యం పట్టివేత

సైదాపూర్: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లు పట్టుకొని సీజ్ చేశామని సైదాపూర్ ఎస్‌ఐ ఆరోగ్యం తెలిపారు. చిగురుమామిడి మండలం బొమ్మెనపల్లికి చెందిన ఓ వ్యక్తి రూ.9,900 విలువ చేసే మద్యం బాటిళ్లు తరలిస్తుండగా సీజ్ చేసి అతడిపై కేస్ నమోదు చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి అక్రమంగా మద్యం అమ్మినా, తరలించినా, బెల్టుషాపులు నిర్వహించినా, డీజేలు పెట్టినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

• ఇద్దరిపై కేసు

జమ్మికుంట: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి తెలిపారు. మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన దుగ్యాల శ్రీకాంత్ అక్రమంగా ట్రాక్టర్‌తో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నామని, కోరపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద రూ.5,000 విలువ చేసే అక్రమ మద్యం పట్టుకొని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం



జమ్మికుంట: రాష్ట్రంలోని సాంఘిక, గిరిజన సంక్షేమ, జనరల్ గురుకులాల్లో 6,7,8,9వ తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరానికి ఏప్రిల్ 21వ తేదీన పరీక్షలు ఉంటాయని, 9వ తరగతిలో ప్రవేశం కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని, రంగారెడ్డి జిల్లా గౌలిదొడ్డి పాఠశాల, కరీంనగర్ జిల్లా అలుగునూర్, ఖమ్మంలోని పరిగి గిరిజన పాఠశాలలో సీట్లు భర్తీ చేయనున్నారని 2024–25 సంత్సరానికి ఏప్రిల్ 21వ తేదీన పరీక్షలు ఉంటాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నాగుపాము హల్‌చల్...



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలో గురువారం నాగుపాము హల్‌చల్ చేసింది. గ్రామంలోని మినరల్ వాటర్ ప్లాంట్ పైపులోకి చేరడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ప్లాంట్ యాజమాని గ్రామ పంచాయతీ కార్మికుడు సంపత్‌కు సమాచారం అందించాడు. ప్లాంట్ వద్దకు చేరుకున్న సంపత్ పామును జాగ్రత్తగా పట్టుకొని డబ్బాలో వేసి గ్రామ శివారులో విడిచి పెట్టగా గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

మహిళలకు అండగా షీ టీంలు

- కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ,
- సైబర్ మోసాల నియంత్రణపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో వాగేశ్వరీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

తిమ్మాపూర్: మహిళలకు అండగా షీ టీంలు ఉంటాయని కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. సీపీ అభిషేక్ మహంతి ఆదేశాల మేరకు తిమ్మాపూర్ మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో షీ టీం పనితీరు, సైబర్ మోసాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షీ టీం సీఐ శ్రీలత మాట్లాడుతూ.. బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో ఏదైనా సమస్యను మౌనంగా భరించకుండా ముందుకు వచ్చి షీటీంను సంప్రదించాలని సూచించారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు

ప్రస్తుతం చిన్న వయసులోనే ప్రేమ అనే ట్రాక్‌లో పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఏసీపీ సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను తరచూ గమనించాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. లైంగిక వేధింపులు ఎదురైతే షీటీంను సంప్రదించాలని, ఆపద సమయంలో డయల్ 100, జిల్లా షీ టీం నంబర్ 8712670759 ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎస్సై చేరాలు, పోలీస్ సిబ్బంది, వాగేశ్వరి కళాశాల జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటరమణ, తదితరులు

‘తిమ్మాపూర్’ను సందర్శించిన యూనిసెఫ్ బృందం





గ్రామంలోని టాయిలెట్స్, విటమిన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న యూనిసెఫ్ బృందం

తిమ్మాపూర్: తిమ్మాపూర్ పంచాయతీని యూనిసెఫ్ సెంట్రల్ టీం గురువారం సందర్శించింది. కౌషిక్ బెనర్జీ, వాష్, హెచ్‌ఎఫ్‌వో వెంకటేశ్, ఫణీంద్రసీపీవో మురళీకృష్ణ గ్రామంలోని కంపోస్టు ఎరువు తయారీ, శానిటరీ మెటీరియల్ స్టాల్ ను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, పీఎస్‌లో రిట్రో ఫిట్టింగ్ టాయిలెట్స్‌ను, విటమిన్ గార్డెన్‌లను పరిశీలించారు. పీహెచ్‌సీలో పారిశుధ్య కార్మికులకు నిర్వహించిన హెల్త్ క్యాంప్‌ను పాల్గొన్నారు. తిమ్మాపూర్‌లో వసతులు బాగున్నాయని అభినందించారు. బృందం వెంట ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్, యూనిసెఫ్ డిస్ట్రిక్ కోఆర్డినేటర్ కిషన్‌స్వామి, రమేశ్, పంచాయతీ కార్యదర్శి మహేందర్ రావు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత



మానకొండూర్‌రూరల్: మండలంలోని శ్రీనివాసనగర్‌లో గురువారం ఇసుక ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు. స్యాండ్ ట్యాక్స్ గడువు ముగిసిన అధికారుల కళ్లుకప్పి కొందరు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. దుమ్ము, ధూళీ, శబ్దకాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, సీపీ, కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు.

ప్రీతమ్‌ను కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛమిస్తున్న మహేందర్

జమ్మికుంట: ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్‌ను హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జమ్మికుంట పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైస మహేందర్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సారంగపాణి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌తోపాటు రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ సాయికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.